క్లుప్తంగా

ఆదమరిస్తే అంతే..



పార్వతీపురం కొత్తవలస నుంచి గోపాలపురం రహదారిపై ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

పార్వతీపురం రూరల్: రోడ్లు మాత్రమే కాదు రహదారిపై అక్కడక్కడ ఉన్న కల్వర్టులు కూడా వాహన చోదకులకు భయాందోళన కలిగిస్తున్నాయి. వ్యవసాయ కాలువలు, చిన్నపాటి కల్వర్టులకు ఇరువైపులా నిర్మించిన రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకోవడంతో, ఏమాత్రం ఆదమరిచి ఉన్నా ప్రమాదాలు తప్పవని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టులకు ఇరువైపులా ఉన్న రక్షణ గోడలకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

యోగా శిక్షకుల సేవలు గుర్తించాలి..

పార్వతీపురం టౌన్: యోగా శిక్షకుల సేవలు గుర్తించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి కిరణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ఆయుష్, విద్యా శాఖల సంయుక్త ఆదేశాల ప్రకారం బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ ద్వారా రాష్ట్రంలోని 907 పాఠశాలలో 1056 మంది యోగా శిక్షకులుగా నియమితులయ్యారన్నారు. వారందరి సేవలను గుర్తించి ప్రభుత్వ పర్యవేక్షణలోకి తీసుకురావాలని కోరారు.

కుట్టు శిక్షణతో ఆర్థిక భరోసా



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: కుట్టు శిక్షణతో మహిళలు ఆర్థిక భరోసా పొందవచ్చని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో మహిళలకు నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో కుటుంబ ఖర్చులు పెరగడం వల్ల భార్యాభర్తలిద్దరూ సంపాదించాల్సిన అవసరం నెలకొందన్నారు. ఈ పరిస్థితుల్లో బీసీ కార్పొరేషన్ ద్వారా కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు ఇళ్ల వద్ద ఉపాధి పొందాలని ఆకాంక్షించారు.

సాక్షి ప్రసారాల నిలిపివేతపై అసంతృప్తి


పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో నెల రోజులుగా సాక్షి టీవీ ప్రసారాలు నిలిపివేయడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సాక్షి ప్రసారాలు పునరుద్ధరిస్తారా.. లేక డిష్‌లు ఏర్పాటు చేసుకోవాలా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే దాదాపు కేబుల్ ఆపరేటర్లకు బాక్సుల నిమిత్తం రూ. 1700 చెల్లించామని.. వాటిని తిరిగి చెల్లిస్తారా, లేదా ప్రసారాలు చేస్తారా అని సామాజిక మాధ్యమాల వేదికగా నిలదీస్తున్నారు. అయితే కేబుల్ ఆపరేటర్లు తమ చేతుల్లో ఏమీ లేదని, ఫైబర్‌నెట్ యాజమాన్యమే ప్రసాదరం చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు.

శాకంబరిగా ఇప్పల పోలమ్మ



పార్వతీపురం టౌన్: పట్టణంలో కొలువైన ఇప్పల పోలమ్మ సోమవారం శాకంబరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారిని పండ్లు, కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

'సామర్థ్యం కలిగి ఉండాలి'



విద్యార్థులతో మాట్లాడుతున్న శక్తి టీమ్ బృంద సభ్యులు

పార్వతీపురం రూరల్: అత్యవసర పరిస్థితులను మహిళలు ఎదుర్కొనే సామర్థ్యం కలిగి ఉండాలని శక్తి టీమ్ ఏఎస్సై శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కరాటేపై మహిళలకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో తమను తాము రక్షించుకోవడానికి కరాటే, కుంగ్‌ఫూ వంటి విద్యలు నేర్చుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరి శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

ప్రజల తరఫున పోరాడుదాం..

- విస్తృతస్థాయి సమావేశంలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

సాలూరు రూరల్: అధికారంలో ఉన్నప్పుడు ప్రజల కోసం పని చేశామని.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల తరఫున పోరాటం చేయాలని ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సాలూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కోదండరామ కల్యాణ మంటపంలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో బాబు ష్యూరిటీ – భవిష్యత్ గ్యారంటీ అంటూ ఒక బాండ్‌పై చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ సంతకాలు చేసి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చారన్నారు. జగనన్న ఇచ్చిన పథకాలు కొనసాగిస్తూనే అంతకంటే మెరుగైన పథకాలు ఇస్తామని చెప్పారన్నారు. అయితే జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 99 శాతం పథకాలు అమలు చేస్తే.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఒక్క హామీ కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. ప్రజలు చంద్రబాబునాయుడిని నమ్మకపోయినా.. ఒకవేళ పథకాలు అమలు చేయకపోతే పవన్ కల్యాణ్ ప్రశ్నిస్తాడనే నమ్మకంతో కూటమికి ఓట్లు వేశారని తెలిపారు. తీరా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వాన్ని నిలదీయలేక పవన్‌కల్యాణ్ తాను పరిపాలనకు పనికిరానని ప్రకటించుకున్నారని ఆరోపించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



హాజరైన నాయకులు, కార్యకర్తలు

ఉచిత బస్సు ఏదీ..

ఉచిత బస్సు పథకానికి సంబంధించి ఇంతవరకు ఎటువంటి ప్రకటన చేయక పోవడం సిగ్గుచేటని మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ.. మహిళలు ఇకపై తిరుపతి వెళ్లాలంటే విజయనగరం నుంచి ఉచితంగా బస్సులో వెళ్లవచ్చని ప్రకటించారని తెలిపారు. ఇప్పుడు ఆ హామీ గురించి సంధ్యారాణి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే ఇటీవల గిరిజన శాఖా మంత్రి సంధ్యారాణి మాత్రం తాము అలాంటి హామీ ఇవ్వలేదని.. పార్వతీపురం వరకే ఉచిత బస్సు అని చెప్పామని అనడం విడ్డూరంగా ఉందన్నారు.

వ్యక్తిగత ధూషణలు తగవు..

మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని ఉద్దేశించి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వ్యక్తిగత ధూషణలు చేయడం తగదని అరకు ఎంపీ తనూజారాణి అన్నారు. ప్రతిపక్ష నాయకుల మీద ఆరోపణలు చేయకుండా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం..

ప్రజలను ఎన్నిసార్లైనా మోసం చేసే సత్తా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు అన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పథకాలను రెట్టింపు చేస్తానని మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఘనుడు చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మక్కువ మండల నాయకులు మావుడి శ్రీనివాసులు నాయుడు, రంగునాయుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, పాచిపెంట ఎంపీపీ ప్రమీల, మండల నాయకుడు డోల బాబ్జీ, సలాది అప్పలనాయుడు, ముత్యాల నాయుడు, సాలూరు మండల నాయకులు దండి శ్రీను, కళ్లేపల్లి త్రినాథ, రామకృష్ణ, పెద్దింటి మాధవరావు, మెంటాడ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

అన్ని హామీలు అమలు చేశాం..

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇచ్చిన అన్ని హామీలనూ అమలు చేశామని మాజీ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఎన్నికల్లో తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయడం ఎంత నిజమో.. తాను ఇచ్చిన అన్ని హామీలనూ అమలు చేశానని.. ఏదైనా హామీ నెరవేర్చకుండా పత్రికాముఖంగా తెలియజేయాలని మంత్రి సంధ్యారాణికి సవాల్ విసిరారు. సంధ్యారాణి మంత్రిగా ఉన్నప్పటికీ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ఏఎస్ఎంల నియామకం జరగలేదు.. జీగిరాం జూట్‌మిల్లు తెరవలేదు.. మక్కువ రోడ్డు అభివృద్ధి చేయలేదు.. మెట్టవలస ఆర్‌సీఎం పాఠశాల భవనానికి తాము రూ. 16 లక్షలు మంజూరు చేసినా పనులు చేపట్టలేదని గుర్తు చేశారు. గిరిజన గ్రామాల్లో తాగునీటి కల్పనకు రూ.3 కోట్లు మంజూరు చేశామని మంత్రి ప్రకటించారని, అయితే ఆ నిధులు ఎక్కడ ఖర్చు చేశారో చెప్పాలని రాజన్నదొర డిమాండ్ చేశారు.

సొంత భవనం ఏర్పాటు చేయాలి

పార్వతీపురం టౌన్: వీరఘట్టం డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టి. అఖిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా వీరఘట్టం డిగ్రీ కళాశాలకి భవనం లేకపోవడం విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. భవన సదుపాయం లేకపోవడంతో జూనియర్ కళాశాలలో ఉదయం డిగ్రీ, మధ్యాహ్నం ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నారని చెప్పారు.

ఉన్నతాధికారులు వెంటనే స్పందించి భవన సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కె. రాజు, కె.డేవిడ్, హెచ్. సింహాచలం, సురేష్, శివ, సంజీవ్, రాజేష్ పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయండి

బలిజిపేట: ప్రభుత్వ ఆదేశానుసారం ఈనెల 10న నిర్వహించనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని విజయవంతగా నిర్వహించేందుకు ఉపాధ్యాయులు సహకరించాలని బలిజిపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటినాయుడు కోరారు. ఈ మేరకు పాఠశాల సిబ్బందితో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిర్దేశించిన ప్రకారం కార్యక్రమాలను నిర్వహించి పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధ్యాయులు, సిబ్బందితో మాట్లాడుతున్న బలిజిపేట ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటినాయుడు

ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం..

పార్వతీపురం టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో పదో తేదీన జరగనున్న మెగా పేరెంట్, టీచర్స్ అసోసియేషన్ సమావేశానికి వేరే శాఖల నుంచి విట్‌నెస్ అధికారులుగా నియమించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరపు సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక డీఈఓ కార్యాలయ ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్షణమే ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ భాస్కరరావు, విజయ్, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.



డీఈఓ కార్యాలయ ఆవరణలో నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

ఎంపీ తనూజారాణికి సన్మానం



ఎంపీ తనూజారాణిని సన్మానిస్తున్న పార్టీ నాయకులు

సాలూరు రూరల్: అరకు ఎంపీ తనూజారాణిని సాలూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. సాలూరులో సోమవారం జరిగిన వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశానికి వచ్చిన ఆమెను పలువురు కలిసి నియోజకవర్గ సమస్యలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పాల్గొన్నారు.

137 కుటుంబాల ఎంపిక

మక్కువ: బంగారు కుటుంబం, పబ్లిక్, ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్ కార్యక్రమంలో భాగంగా స్థానిక సచివాలయం 1,2 ల నుంచి 137 కుటుంబాలు ఎంపికైనట్లు మక్కువ పంచాయతీ కార్యనిర్వహణ అధికారి బెహరా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానిక సచివాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపికైన కుటుంబాలను దత్తత తీసుకోవడానికి మార్గదర్శిగా సచివాలయం సిబ్బంది పని చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

దోమల బెడద నివారించండి..

- కాంగ్రెస్ నాయకులు

పార్వతీపురం టౌన్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు పార్వతీపురం మన్యం జిల్లాలో పెరిగిన దోమల బెడదను నివారించేందుకు చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జేసీ శోభికను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీతో పాటు జిల్లాలో పరిధిలోని వేధిస్తున్న దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. మున్సిపాలిటీలో మురుగు కాలువల్లో మురుగుతీత పనులు చేపట్టాలన్నారు. దోమల నివారణకు ఏసిఎం ద్రావణం పిచికారీ, గంబూషియా చేపల విడుదల, ఫాగింగ్, తదితర కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అలాగే పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న ప్రభుత్వ కార్యాలయ సముదాయానికి వెళ్లే రహదారికి మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, జిల్లా నాయకులు కోణా కిరణ్‌కుమార్, పాలక రంజిత్ కుమార్, మండల అధ్యక్షులు తీళ్ల గౌరీశంకరరావు, తదితరులు పాల్గొన్నారు.



జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభికకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నిర్లక్ష్యం ప్రమాదానికి కారణం కారాదు..



అవగాహన కల్పిస్తున్న పట్టణ ట్రాఫిక్ ఎస్సై పాపారావు

పార్వతీపురం రూరల్: వాహనదారుల నిర్లక్ష్యం ప్రమాదాలకు కారణం కారాదని పట్టణ ట్రాఫిక్ ఎస్సై పాపారావు అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఆటో, ద్విచక్ర వాహనదారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు.

ఆందోళన చెందొద్దు..

- పోస్టల్ ఐపీఓలు శ్రీనివాసరావు, అచ్యుతరావు

సీతానగరం:

మండలంలోని గెడ్డలుప్పి బ్రాంచ్ పోస్టాఫీస్‌లో వివిధ రకాల పథకాల ద్వారా కొత్తవలస, గెడ్డలుప్పి గ్రామాలకు చెందిన ఖాతాదారులు దాచుకున్న సొమ్ము విషయంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పోస్టల్ ఐపీఓలు శ్రీనివాసరావు, అచ్యుతరావు అన్నారు. పోస్టాఫీస్‌లో డబ్బులు గల్లంతయ్యాయన్న ఫిర్యాదు మేరకు అధికారులు రెండోరోజు సోమవారం కూడా విచారణ చేపట్టారు. కట్టిన డబ్బుల వివరాలను బుక్‌లో నమోదు చేయక పోవడం.. మెసేజ్‌లు కూడా రాకపోవడంతో బాధితుల ఫిర్యాదు మేరకు బీపీఎం బి. రాణి, బాధితుల సమక్షంలో విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.విచారణకు పది రోజుల సమయం పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లు తిరుపతి రావు, ఖాతాదారులు పాల్గొన్నారు.



బీపీఎం రాణి సమక్షంలో రికార్డులు పరిశీలిస్తున్న ఐపీఓలు


ఆందోళనగా ఉంది..



అత్యవసర సమయంలో ఆసరాగా ఉంటుందని పోస్టాఫీస్ లో 18 నెలలుగా డబ్బులు దాచుకుంటున్నాను. పోస్టుమాస్టర్ వారం రోజులుగా విధులకు హాజరుకాకపోవడంతో అందరూ ఆందోళన చెందుతున్నారు. అధికారులు న్యాయం చేయాలి.

– కె. రాములమ్మ, గెడ్డలుప్పి

న్యాయం చేయండి..



పెన్షన్ డబ్బుల్లో కొంత మిగుల్చుకుని దాచుకుంటున్నాను. డబ్బులు స్వాహా చేసినట్లు వస్తున్న పుకార్ల నేపథ్యంలో ఆందోళనగా ఉంది. 18 నెలలు బట్టి డబ్బులు దాస్తున్నాను. అధికారులు స్పందించి నా డబ్బులు నాకు ఇప్పించాలి.

– వాకాడ పార్వతమ్మ, గెడ్డలుప్పి

సమ్మెను విజయవంతం చేయండి



బలిజిపేటలో బైక్ ర్యాలీ నిర్వహించిన ప్రజా సంఘాలు

- రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

బలిజిపేట: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ బుధవారం చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు జి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు బలిజిపేట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని చెప్పారు. ఈ చట్టాల వల్ల కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ఇప్పటికే దేశంలో కనీస వేతనాలు అమలు కాక ఉద్యోగ భద్రత లేక కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు, ప్రజాసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం: మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

ప్రజారేక విధానాలను వ్యతిరేకించాలి..

పార్వతీపురం: పీఎం నరేంద్ర మోదీ చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని కోరుతూ బుధవారం చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వందలాది రైతు సంఘాలకు నాయకత్వం వహిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా ఈ సమ్మెలో పాల్గొంటుందని తెలిపారు. రైతాంగ హక్కులను కాలరాయడానికి మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చారన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయడంతో పాటు కనీస వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

గిరిజన అభ్యర్థులకే పోస్టులు కేటాయించాలి

పార్వతీపురం: గిరిజన అభ్యర్థులకు రిజర్వేషన్ ద్వారా కేటాయించిన సీసీఆర్‌టీ పోస్టులను వారికే ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయ ఇన్‌చార్జ్ డీడీ చంద్రబాబు, సూపరింటిండెంట్ దేశ్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2016 – 17 విద్యాసంవత్సరంలో జీఓ 3 ప్రకారం గిరిజన యువతకు రావాల్సిన ఫిజిక్స్, ఇంగ్లిష్ టీచర్ పోస్టులకు సంబంధించి గిరిజనులు లేరని, అప్పట్లో గిరిజనేతరులను నియమించారని తెలిపారు. ప్రస్తుతం గిరిజన అభ్యర్థులు అందుబాటులో ఉన్న నేపథ్యంలో వారి పోస్టులు వారికే కేటాయించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మువ్వల అమర్‌నాథ్, కద్రక చిన్నారావు, వెంకటరావు, జోగారావు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జ్ డీడీ చంద్రబాబుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న గిరిజన సంఘ నాయకులు రంజిత్‌కుమార్, తదితరులు

విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేద్దాం

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశాన్ని విజయవంతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా కేంద్రంలో గల రాయల్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ వద్ద జరగనున్న సమావేశానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజారాణి, పార్లమెంట్ పరిశీలకుడు జి. ప్రసాద్ హాజరవుతారన్నారు.

సమావేశానికి పార్వతీపురం నియోజకవర్గ పరిధిలో గల మూడు మండలాలు, పురపాలక సంఘం నుంచి పార్టీ అధ్యక్షులు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

ఘనంగా ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

- జిల్లా అధ్యక్షుడు గొడబ ప్రభాకర్



పెదబొండపల్లిలో నినాదాలు చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

పార్వతీపురం రూరల్: ఎంఆర్‌పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పలు గ్రామాల్లో ఎంఆర్‌పీఎస్ జెండాలను ఆవిష్కరించినట్లు జిల్లా అధ్యక్షుడు గొడబ ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు పార్వతీపురం మండలం పెదబొండపల్లి దళితవాడలో ఆవిర్భావ దినోత్సవ నిర్వహించారు. అలాగే మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను కూడా జరుపుకున్నారు. కార్యక్రమంలో పలువురు ఎంఆర్‌పీఎస్ నాయకులు, పెదబొండపల్లి గ్రామస్తులు, ఎంఈఎఫ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించి న్యాయం చేయాలి

పార్వతీపురం రూరల్: తమకు చెందిన 2.10 ఎకరాల భూమి వద్దకు రావద్దని కొంతమంది బెదిరిస్తున్నారని మక్కువ మండలం కోన గ్రామానికి చెందిన వి.శోభారాణి ఆరోపించారు. ఈ మేరకు ఎస్పీ మాధవ్‌రెడ్డిని సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఆ భూమిని తనకు రెవెన్యూ అధికారులు అప్పగించారని.. కాని గ్రామానికి చెందిన శంకరాపు లక్ష్మణరావు, తదితరులు భూమి వద్దకు వస్తే చంపుతానని బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తనకు న్యాయం చేసి రక్షణ కల్పించాలని కోరారు.



ఎస్పీ కార్యాలయం ఎదుట ఫిర్యాదుతో శోభారాణి